TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-176 పేజీలు:-4 మంగళవారం 08-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## 50 ఏళ్ల బ్లాక్ హోల్ మిస్టరీ వీడింది!

- పాలపుంత మధ్యలో బ్లాక్‌హోల్ నుంచి గాలులు వీస్తున్నట్టు గుర్తింపు
- శాస్త్రవేత్తల 50 ఏళ్ల అన్వేషణకు దొరికిన కీలక ఆధారం
- అల్మా టెలిస్కోప్ డేటాతో రహస్యాన్ని ఛేదించిన పరిశోధకులు
- ఈ గాలులు నక్షత్రాల ఏర్పాటును నెమ్మదింపజేస్తాయని వెల్లడి



మన పాలపుంత (వీఅశ్రీనిఎ ఔంఎ) మధ్యలో ఉన్న భారీ కృష్ణబిలం (బ్లాక్‌హోల్) 'సగిటారియస్ ఏ' నుంచి వెలువడుతున్న ఉష్ణ పవనాలను శాస్త్రవేత్తలు తొలిసారిగా గుర్తించారు. దాదాపు 50 ఏళ్లుగా ఖగోళ శాస్త్రవేత్తలకు అంతుచిక్కని - మిగతా 2 లో

## ఇజ్రాయెల్ పై చర్యలు నిలిపివేస్తున్నాం

- ఇరు దేశాల మధ్య క్షిపణి దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే నిర్ణయం
- లెబనాన్‌లో దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్ హెచ్చరిక
- ఉద్రిక్తతలు తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల స్పందన
- అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకారం



ఇజ్రాయెల్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌పై చేపట్టిన సైనిక కార్యకలాపాలను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు సోమవారం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష క్షిపణి దాడులు జరిగిన - మిగతా 2 లో

## స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు



- తెలంగాణలో స్కూళ్ల కుదింపుపై మొదలైన రాజకీయ దుమారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత ఫైర్
- 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణమన్న కవిత
- ఈ నిర్ణయం పేద, బాలికల విద్యకు గొడ్డలిపెట్టని విమర్శ
- గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమీక్షించలేదని ఆరోపణ

రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా 2 లో

## నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర



- కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా బొగ్గు ఉండేదన్న కిషన్ రెడ్డి
- రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని వెల్లడి
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వ్యాఖ్య

నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి - మిగతా 2 లో

## అభివృద్ధి జరగకుండా కిషన్ రెడ్డి
# కాళ్లలో కట్టెలు పెడుతుండు

- తెలంగాణ అభివృద్ధి జరగకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని తెలంగాణ సీఎం విమర్శించారు
- అభివృద్ధి జరగకుండా కాళ్లలో కట్టెలు పెడుతున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు
- వరుసగా మూడో రోజు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు.




'కేసీఆర్, కిషన్ రెడ్డి మీ అవినీతి, అహంకారంతో తెలంగాణ ప్రజలకు నష్టం చేయకండి. మీ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారు. నేను ప్రధానిని కలిస్తే కిషన్ రెడ్డి ప్రధానిని కలుస్తాడు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం



- రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సహాయం
- ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం చెల్లింపు
- బాధితులకు స్థానిక అధికారులు అన్ని విధాలా సాయం చేస్తున్నారని వెల్లడి

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర - మిగతా 2 లో

## ఇండీ' కూటమి సమావేశానికి
# టీవీకేకు అందని ఆహ్వానం

- నేడు ఢిల్లీలో ప్రతిపక్ష 'ఇండీ' కూటమి భేటీ
- హాజరుకానున్న ప్రధాన ప్రతిపక్ష పార్టీలు
- ఎంపీలు ఉన్న పార్టీలనే ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వివరణ
- ఒక్క ఎంపీలేని టీవీకేకు అందుకే ఆహ్వానం అందలేదని సమాచారం




ఢిల్లీలో నేడు ప్రతిపక్ష 'ఇండీ' కూటమి భేటీ కానుంది. దీనికి తమిళనాడులో ఇటీవలే అధికారంలోకి వచ్చిన విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) హాజరవడంపై ఇప్పటికీ స్పష్టత లేదు.

## ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని కూటమి తీర్మానం



- బీజేపీని ఎదుర్కోవాలంటే..: 'ఇండియా' కూటమి భేటీలో 15 నిమిషాలు మాట్లాడిన రాహుల్ గాంధీ
- ఢిల్లీలో సమావేశమైన విపక్ష కూటమిలోని పార్టీల నాయకులు
- విభేదాలు పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపు
- ఓటర్ల జాబితాలో అవకతవకలపై సీజేఐకి ఫిర్యాదుకు నిర్ణయం
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

బీజేపీ నుంచి ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు మిత్రపక్షాలన్నీ విభేదాలను - మిగతా 2 లో

## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం



- వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ స్పందన
- 8 మంది దుర్మరణం
- ప్రమాద ఘటనపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన లోకేష్
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెల్లడి

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో జరిగిన ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ తీవ్ర- మిగతా 2 లో

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9కి పెరిగిన మృతుల సంఖ్య

- ఘటన స్థలిని పరిశీలించిన హోంమంత్రి అనిత, ఎంపీ భరత్
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని సందర్శించిన హోంమంత్రి అనిత
- ప్రమాదం జరిగిన తీరును ఉద్యోగులను అడిగి తెలుసుకున్న వైనం



క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం విశాఖ కలెక్టరేట్‌లో సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు ఈ దుర్ఘటనలో 9 మంది కార్మికులు మృతి చెందినట్లు నిర్ధారణ - మిగతా 2 లో

## పరీక్షలంటే తెలియని వారు కూడా
# బురద జల్లుతున్నారు

- పశ్చిమగోదావరి జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం
- హాజరైన సీఎం చంద్రబాబు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములు కాజేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ
- భద్రతా ఫీచర్లతో రాజముద్ర వేసి కొత్త పాస్‌బుక్కులు ఇస్తున్నామని వెల్లడి
- రికార్డులు ఫోర్జరీ చేసిన ఎమ్మెల్యేపై వైసీపీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? అంటూ ప్రశ్న
- గొడ్డలి పార్టీకి రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత లేదంటూ ఫైర్
- ఆక్వా రైతులకు అండగా ఉంటాం.. కేంద్రంతో మాట్లాడుతున్నామని భరోసా




పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం

మొదటిపేజీ తరువాయి – మోదీ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు స్పందించిన ప్రధాని మోదీ, మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (గ్రావీచీ=ఖీ) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు స్థానిక అధికారులు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇవాళ సాయంత్రం విశాఖ స్టీల్ ప్లాంట్ వేడి ఉక్కు ద్రవం ఉన్న ల్యాడిల్ విస్ఫోటనం చెందడంతో 9 మంది కార్మికులు మృతి చెందడం తెలిసిందే.

## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి – దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ దుర్ఘటనపై స్పందించిన మంత్రి లోకేష్, “విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదంలో కార్మికులు మృతిచెందటం తీరని విషాదం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను” అని అన్నారు.ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని లోకేష్ తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యం, సహాయక చర్యలను ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9కి పెరిగిన మృతుల సంఖ్య

మొదటిపేజీ తరువాయి – విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో మృతుల సంఖ్య 9కి పెరిగింది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ దుర్ఘటన జరిగిన తీరును వారు పరిశీలించారు. ప్లాంట్‌లోని రామీ–2, రాజ–3 విభాగాల్లో వేడి లోహ ద్రవం లీకైన ప్రదేశాన్ని హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, సహాయక చర్యలు, భద్రతా ఏర్పాట్లు, క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, గాయపడిన కార్మికులకు సాధ్యమైనంత ఉత్తమ వైద్యం అందించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు 0891-2590100, 0891-2590102 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ ప్రమాదం స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటనల్లో ఒకటిగా నిలిచింది.

## స్కూళ్ల కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి – ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన ‘సమీకృత పాఠశాలలను’ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.ం

### నవభారత నిర్మాణంలో
## బొగ్గు రంగానిదే కీలక పాత్ర

మొదటిపేజీ తరువాయి – కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో ‘బొగ్గు’ అంటే కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని... ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రస్తుతం ‘అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్’ (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని.. ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు.. అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## 50 ఏళ్ల బ్లాక్ హోల్ మిస్టరీ వీడింది!

మొదటిపేజీ తరువాయి – ఈ రహస్యాన్ని తాజా పరిశోధన ఛేదించింది. చిలీలోని అటాకామా లార్జ్ మిల్లీమీటర్/సబ్‌మిల్లీమీటర్ అరే (ఆూహీూ) రేడియో టెలిస్కోప్ ద్వారా సేకరించిన డేటాతో ఈ కీలక ఆవిష్కరణ చేశారు. నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన ఎలెనా ముర్చికోవా, మార్క్ గోర్స్కీ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. ఐదేళ్ల పాటు సుమారు 100 గంటల పాటు గెలాక్సీ కేంద్రాన్ని పరిశీలించి, కార్బన్ మోనాక్సైడ్ (జూ) వాయువు కదలికలను మ్యాప్ చేశారు. ఈ ప్రక్రియలో బ్లాక్‌హోల్ నుంచి వెలువడే రేడియో తరంగాలను జాగ్రత్తగా వేరుచేసి, అత్యంత స్పష్టమైన చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో బ్లాక్‌హోల్ చుట్టూ ఉన్న శీతల వాయువులో కోన్ ఆకారంలో ఒక ఖాళీ ప్రదేశం ఉన్నట్లు కనుగొన్నారు. దీని పొడవు సుమారు మూడు కాంతి సంవత్సరాలు ఉంటుందని అంచనా. నాసాకు చెందిన చంద్ర ఎక్స్‌రే అబ్జర్వేటరీ డేటా కూడా ఇదే ప్రాంతంలో వేడి వాయువు నిండి ఉన్నట్లు నిర్ధారించింది. దీనిని బట్టి బ్లాక్‌హోల్ నుంచి వీస్తున్న వేడిగాలులే చుట్టుపక్కల ఉన్న శీతల వాయువును పక్కకు నెడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారణకు వచ్చారు. సాధారణంగా క్రియాశీల బ్లాక్‌హోల్స్ నుంచి శక్తివంతమైన గాలులు వెలువడతాయి. అయితే, మన గెలాక్సీలోని ‘సగిటారియస్ ఏ’ వంటి నిశ్శబ్ద బ్లాక్‌హోల్స్ నుంచి కూడా ఇలాంటి బలహీనమైన గాలులు వెలువడతాయని ఈ పరిశోధన తొలిసారిగా నిరూపించింది. ఈ గాలులు అంత శక్తివంతమైనవి కాకపోయినా, అవి నక్షత్రాల ఏర్పాటు ప్రక్రియను నెమ్మదింపజేయగలవని పరిశోధకులు తెలిపారు. ఈ గాలుల వేగం, కదలికలపై మరింత స్పష్టత కోసం మరిన్ని పరిశీలనలు అవసరమని వారు పేర్కొన్నారు. ఈ తాజా ఆవిష్కరణ వివరాలను ‘ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్’లో ప్రచురించారు.

## పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

మొదటిపేజీ తరువాయి – ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక దాదాపు 16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే ‘గొడ్డలి పార్టీ’ పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

**భూ రికార్డుల ప్రక్షాళన.. రాజముద్రతో పాస్‌పుస్తకాలు**

భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. “మేం అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి భూ యాజమాన్య హక్కుల్ని కాపాడాం. భూమి మీది, కానీ ఫొటోలు వారివి ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై కూడా వారి బొమ్మలు వేసుకున్నారు” అని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి పటిష్టమైన చర్యలతో, కరెన్సీ నోట్ల తరహా భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 26.46 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేశామని, నిర్దేశిత గడువులోగా మొత్తం 90 లక్షల పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తెచ్చి, 1.37 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను 22ఏ నుంచి తప్పించామని పేర్కొన్నారు.

**రెండేళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమం**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో సభలు పెడుతున్నామన్నారు. “అభివృద్ధిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. అందుకే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి, యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో చెప్పిన వాటికంటే అదనంగానే ఇచ్చాం” అని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం వాటాతో కలిపి రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని చెప్పారు.

**గోదావరి జిల్లాలకు పెద్దపీట**

దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఉన్న గోదావరి జిల్లాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, తాము 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నామని, ఫీడ్ ధరల పెరుగుదల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

**గొడ్డలి పార్టీకి రాజకీయాలు చేసే అర్హత లేదు**

తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన వినుకొండ మాజీ ఎమ్మెల్యేను వైసీపీ అధ్యక్షుడు ఎందుకు సస్పెండ్ చేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ‘గొడ్డలి పార్టీ’కి లేదని, వారు రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే గంజాయి బ్యాచ్‌లను, గొడ్డలి పార్టీ వ్యక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారు. చెప్పినట్టుగానే పెద్దాయనను కలిసిన చంద్రబాబు... వీడియో ఇదిగో!పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో వృద్ధుడితో ప్రత్యేక భేటీ కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ ఆనందం వృద్ధుడిని ఆలింగనం చేసుకుని, ఆరోగ్యంపై ఆరా తీసిన ముఖ్యమంత్రిచంద్రబాబును చూడటంతో మనసు నిండిపోయిందన్న సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు 96 ఏళ్ల వృద్ధుడి జీవితకాల కోరికను నెరవేర్చి, తన మానవత్వాన్ని చాటుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడు, తన అభిమాన నేత అయిన చంద్రబాబును కలవాలని చిరకాలంగా ఆశిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి, సోమవారం తన జిల్లా పర్యటనలో భాగంగా ఆయన్ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సమావేశం అత్యంత భావోద్వేగభరితంగా సాగింది. సత్యనారాయణను చంద్రబాబు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన నూరేళ్లు నిండు ఆరోగ్యంతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురూ కాసేపు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన ఆనందంలో సత్యనారాయణ స్పందిస్తూ “ఇక రెండు రోజులు భోజనం చేయకపోయినా పర్వాలేదు, నా మనసు నిండిపోయింది” అని ఆనందం వ్యక్తం చేశారు. నాయకుడికి, అభిమానికి మధ్య ఉన్న ఈ అనుబంధాన్ని చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో నిర్వహించిన ‘మీ భూమి–మీ హక్కు’ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు సవరించిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. తన అధికారిక కార్యక్రమాల ఒత్తిడిలోనూ సమయం కేటాయించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

## అభివృద్ధి జరగకుండా కిషన్ రెడ్డి కాళ్లలో కట్టెలు పెడుతుండు

మొదటిపేజీ తరువాయి – నేను కేంద్ర మంత్రిని కలిస్తే ఆయన కేంద్ర మంత్రిని కలుస్తాడు. తెలంగాణకు నిధులు రాకుండా, అభివృద్ధి జరగకుండా కాళ్లలో కట్టెలు పెడుతుండు’ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఇలాగే చేస్తే మీకు తెలంగాణలో పుట్టగతులు లేకుండా ప్రజలు తీర్పు ఇస్తారు. మళ్లీ మీరు ఢిల్లీకి పోకుండా చేస్తారు’ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మియాపూర్‌లో జరిగిన బహిరంగసభలో తెలంగాణ ముఖ్యమంత్రి కీలక ప్రసంగం చేశారు. ‘ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, కలకత్తా, చెన్నై, హైదరాబాద్ ఈ ఆరు నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. హైదరాబాద్ మహా నగరం వేగంగా విస్తరిస్తోంది. ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికే మహా నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాం. విస్తరిస్తున్న నగరం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మూడు కార్పొరేషన్లు చేశాం. పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా సరిహద్దులు నిర్ణయించాం. జెండాలకు ఎజెండాలకు అతీతంగా మన నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం’ అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**ఎందుకు నిధులు అడగడం లేదు?**

పేదల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ‘చేవెళ్ల, మెదక్, మల్కాజిగిరి ఎంపీలు బీజేపీ వాళ్లే ఉన్నారు. సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. బీజేపీ ఎంపీలు ప్రధాని మోదీని ఎందుకు నిధులు అడగడం లేదు తెలంగాణ అభివృద్ధికి నిధులు రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డి కాదా?’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చర్చకు సిద్ధం**

‘మోదీ గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే ఆహా ఓహో అంటున్నారు. ఇక్కడ మూసీని అభివృద్ధి చేస్తామంటే అడ్డుకుంటున్నారు. బీజేపీ ఎంపీలకు రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత లేదా?’ అని రేవంత్ రెడ్డి నిలదీశారు. పదేళ్ల కేసీఆర్ పాలన , పన్నెండేళ్ల మోదీ పాలన, 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఎవరేం చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి అంటూ సవాల్ చేశారు. ‘త్వరలో గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మించబోతున్నాం. మూడు నెలల్లో ఇందుకు సంబంధించిన పనులను మొదలు పెట్టుకుందాం. విశ్వనగరం అని గొప్పలు చెప్పుకుంటే సరిపోదు.. దీనికి అనుగుణంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలి. అందుకే మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నాం’ అని రేవంత్ రెడ్డి వివరించారు. మహానగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్లను కట్టి పేదల కష్టాలు తీరుస్తామని.. ఎక్కడ ఉన్న వారికి అక్కడే ఇండ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు.

**ఇండ్లు నిర్మాణానికి ప్రణాళికలు**

‘ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి విడిపించి అక్కడ పేదలకు ఇండ్లు నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌ను అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి ద్వారా 150 స్టాల్స్‌ను మహిళలకు అందించాం. మహిళలను పెట్రోల్ బంక్‌లకు యజమానులను చేశాం’ అని రేవంత్ రెడ్డి వివరించారు.

## ఇజ్రాయెల్ పై చర్యలు నిలిపివేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి – కొన్ని గంటల్లోనే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా, ఇరాన్ ఆదివారం రాత్రి ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీంతో మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని, ఇరు దేశాలు వెంటనే దాడులు ఆపాలని పిలుపునివ్వడంతో ఉద్రిక్తతలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ దాడులను ‘బాధాకరమైన ప్రతిస్పందన’గా అభివర్ణించిన ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయం, ప్రస్తుతానికి తమ ఆపరేషన్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, భవిష్యత్తులో ఇజ్రాయెల్ ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా, ముఖ్యంగా దక్షిణ లెబనాన్‌లో దాడులు కొనసాగించినా మరింత తీవ్రమైన ప్రతిచర్యలు తప్పవని హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై దాడులు నిలిపివేసినట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామంతో అంతర్జాతీయ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. చమురు ధరలు తగ్గగా, స్టాక్ ఫ్యూచర్లు వృద్ధిని నమోదు చేశాయి. గత ఏప్రిల్‌లో కుదిరిన ఒప్పందం తర్వాత ఇరు దేశాల మధ్య ఈ స్థాయిలో ప్రత్యక్ష ఘర్షణ చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు కనిపిస్తున్నప్పటికీ, ఇరాన్ విధించిన షరతులతో కూడిన వైఖరి వల్ల మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని కూటమి తీర్మానం

మొదటిపేజీ తరువాయి – పక్కనపెట్టి ఏకతాటిపైకి రావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ‘ఇండియా’ కూటమి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఒకరినొకరు విమర్శించుకోవడం మానుకొని, సమైక్యంగా ముందుకు సాగాలని మిత్రపక్షాలకు సూచించారు. సుమారు 15 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్, “కలిసికట్టుగా ఉంటేనే మన మనుగడ సాధ్యం” అని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు, అధికార పక్షాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి సంఘీభావం అత్యవసరమని పేర్కొన్నారు. అయితే, ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలపై కొన్ని మిత్రపక్షాల నుంచి తగిన స్థాయిలో మద్దతు లభించలేదని ఆయన ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుల విషయంలో విపక్షాలు సాధించిన విజయాన్ని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో కూటమిని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, వామపక్ష ప్రతినిధులతో సహా మొత్తం 23 పార్టీల నేతలు పాల్గొన్నారు. కాగా, ఈ భేటీకి డీఎంకే గైర్హాజరయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై భారత ప్రధాన న్యాయమూర్తికి (సీజేఐ) ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి పార్టీల మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని, తదుపరి భేటీని ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

## ఇండీ’ కూటమి సమావేశానికి టీవీకేకు అందని ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి – అయితే ఈ సమావేశానికి ఆ పార్టీకి ఇంకా ఆహ్వానం పంపలేదని సమాచారం. దీనిపై కూటమి నేతలు ఈరోజు సాయంత్రంలోగా తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని ‘టీవీకే’ పార్టీకి కాంగ్రెస్ ప్రధాన మిత్రపక్షంగా ఉంది. అయినప్పటికీ ఈ సమావేశానికి విజయ్ పార్టీని పిలవకపోవడంపై కాంగ్రెస్ వర్గాలు స్పష్టత ఇచ్చాయి. కేవలం పార్లమెంట్ సభ్యులున్న రాజకీయ పార్టీలను మాత్రమే ఆహ్వానించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రస్తుతం ‘టీవీకే’కు ఎలాంటి ఎంపీల ప్రాతినిధ్యం లేదు. అందుకే ఆ పార్టీకి ఇంకా ఆహ్వానం పంపలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ తమ కూటమిని బలోపేతం చేయడానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తమకు దక్కిన ఏకైక ఖాళీ రాజ్యసభ సీటును మిత్రపక్షమైన కాంగ్రెస్‌కే కేటాయించారు. ఇటీవల జరిగిన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓటముల తర్వాత.. ప్రతిపక్షాల వ్యూహాలను మార్చేందుకు ఈ ‘ఇండీ’ కూటమి అత్యవసరంగా సమావేశమవుతోంది. కూటమి ఐక్యతను చాటడానికి, అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడానికి జరుగుతున్న ఈ సదస్సుకు 23 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు హాజరవుతారని సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్ వంటి బడా నేతలు ఈ భేటీలో పాల్గొని భవిష్యత్తు వ్యూహాలపై చర్చించనున్నారు.

## యుద్ధాన్ని తక్షణమే ఆపండి
## ఇరాన్, ఇజ్రాయెల్‌కు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్





ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్.. రెండు దేశాలూ తక్షణమే యుద్ధం ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని కోరాడు. ఇప్పటికే శాంతి చర్చలు కొనసాగుతున్నాయని, ఇవి ముగిసిపోయే అవకాశం ఉందని, అతిత్వరలోనే ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ ద్వారా వెల్లడించారు. ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు చేసుకోవడం ఆపి, చర్చలకు సిద్ధం కావాలని ట్రంప్ సూచించాడు. ప్రస్తుతం ఉద్రిక్తతలు తగ్గించడానికి తాను ప్రయత్నిస్తున్నానని, అయితే, ఉద్రిక్తతలు తగ్గకపోతే మళ్లీ సైనిక చర్య తప్పకపోవచ్చని ట్రంప్ అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు చేసిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు ట్రంప్ చెప్పారు. చర్చలు సజావుగా సాగడానికి, శాంతి ఒప్పందం కుదరడానికి నెతన్యాహును ఒప్పించినట్లు ట్రంప్ వెల్లడించారు. చర్చలు తుది దశలో ఉన్నాయని, బుధవారం లోపు శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడుల వల్లే మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయని, దీంతో ఇజ్రాయెల్ ప్రతిదాడులకు దిగిందని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు ఇరాన్ మళ్లీ చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో లెబనాన్‌లోని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను కూడా ట్రంప్ ఖండించారు. లెబనాన్‌పై సైనిక చర్యలు ఆపేయాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించానని ట్రంప్ తెలిపారు. దీనికి ఇజ్రాయెల్ వెంటనే అంగీకరించిందన్నారు.

# హెచ్.ఎ.ల్ టౌన్షిప్ లో వాటర్ సమస్యల పై కోలన్ హనుమంత్ రెడ్డి ని కలిసిన హెచ్.ఎ.ల్ యూనియన్ నాయకులు

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 8:** బాలానగర్ డివిజన్ లో గల హెచ్.ఎ.ల్ టౌన్షిప్ లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి ఎద్దటిని ఎదుర్కుంటున్నారు. టౌన్షిప్ లో కార్మికులు, అధికారులు, ట్రైనిస్ నివసిస్తున్నారు. వాటర్ వర్క్స్ వాళ్ళు ఇచ్చే నీటి సరఫరాను తగ్గించటంతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, కూకట్పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి కర్నెనాగరాజు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, కార్మిక నాయకుడు కోలన్ హనుమంత్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి హెచ్.ఎ.ల్ టౌన్షిప్ లో నీటి సమస్యను వారి దృష్టికి తీసుకోచ్చాము. వారు వెంటనే స్పందించి




వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి కి ఫోన్ లో మాట్లాడి సమస్యను వివరించారు. వెంటనే హెచ్.ఎ.ల్ టౌన్షిప్ లో నీటి సప్లై ని పెంచి నీటి సమస్యను పరిష్కరించాలని వారిని ఆదేశించారు. సమస్య పరిష్కారానికై కృషి చేసిన కొలను హనుమంత్ రెడ్డి కి యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి ని కలిసి సమస్యను వివరించడం వారు సమస్య ను పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అయిన హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కుతాడికృష్ణా, జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున,ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు

**శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఐపీఎస్.,**

**భూ వివాదం పేరుతో చట్టవ్యతిరేక సమావేశం నిర్వహించిన 11 మంది అరెస్ట్**

**ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన వారిపై కేసు నమోదు**

నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 8 : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో భూ వివాదం నేపథ్యంలో చట్టవ్యతిరేకంగా గుమికూడి ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన 11 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. 07-06-2026 తేదీన నానక్‌రామ్‌గూడ ప్రాంతంలోని ఓ స్థలంలో భూ వివాదానికి సంబంధించి 10 నుంచి 15 మంది వ్యక్తులు చట్టవ్యతిరేకంగా గుమికూడి స్థానిక ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం గచ్చిబౌలి పోలీసులకు అందింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, 11 మంది వ్యక్తులు చట్టవ్యతిరేక సమావేశంగా ఏర్పడి దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించగా, వారు సరైన సమాధానం ఇవ్వకుండా పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించారు. దీంతో పోలీసులు తక్షణ చర్యగా వారిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నానక్‌రామ్‌గూడ పరిధిలోని జనచైతన్య కంపెనీకి సంబంధించిన భూ వివాదం నేపథ్యంలో ఆ కంపెనీలో పనిచేసే శివప్రసాద్, శ్రీకాంత్ గౌడ్‌లు భూ వివాదాన్ని సెటిల్ చేసేందుకు కొంతమందిని అక్కడికి పిలిపించినట్లు వెల్లడైంది. అదుపులోకి తీసుకున్న వారిలో హర్విందర్ సింగ్, సుర్జీత్ సింగ్, మేరాజ్, జగదీష్ సింగ్, హరిప్రీత్ సింగ్, సిమ్రంజిత్ సింగ్, ఉపేందర్ సింగ్, చరణ్ సింగ్, బల్వేందర్ సింగ్, మన్మీత్ సింగ్ తదితరులు ఉన్నారు. వీరిలో నలుగురు నిందితులపై



గతంలో కూడా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, చట్టవ్యతిరేక సమావేశం నిర్వహించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడం, అలాగే పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 189, 132, 270 కింద కేసు నమోదు చేసి న్యాయస్థానానికి తరలించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఐపీఎస్.మాట్లాడుతూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు, చట్టవ్యతిరేక సమావేశాలు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలను సైబరాబాద్ పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. భూ వివాదాలు లేదా ఇతర ఆస్తి సంబంధిత సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. భూ వివాదాల పేరుతో బలప్రయోగం, బెదిరింపులు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రపంచ దిగ్గజాలకు విశ్వాసం కలిగేలా "ఫ్యూచర్ సిటీ'

**కాలుష్యం లేని మహానగరంగా కొత్తపట్టణం నిర్మిస్తాం**

**జిహెచ్ఎంసి డివిజన్ నాయకులతో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8 :** బాలాపూర్ ఫ్యూచర్ సిటీని అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కారు కూతలు కూసే బీఆర్ఎస్ నేతల మాటలను పట్టించుకోవద్దని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని మీర్ పేట, నందిహిల్స్, జిల్లెలగూడ, బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్ డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మల్లాపూర్ లోని వైఏఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సమావేశం కేఎల్ఆర్ ఏర్పాటు చేశారు. ఈనెల 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్శిటీ భవనాలను ప్రారంభించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ శ్రేణులను కేఎల్ఆర్ కోరారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు నమ్మకం కలిగేలా ఫ్యూచర్ సిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాలుష్యం లేని మహానగరంగా మార్చేందుకు గ్రీన్ ఫార్మా, పర్యావరణహితమైన సంస్థలకే అనుమతులు ఇస్తున్నట్లు, మహేశ్వరం నియోజకవర్గానికి మైలురాయి కానున్న ఫ్యూచర్ సిటీలో జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏలిమేటి అమరేందర్ రెడ్డి సహా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయిల్ ఫెడ్ తెలంగాణ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

**అధ్యక్షులు గా సిహెచ్ రాములు**



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8** :నూతన కమిటీ సభ్యులను అభినందించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి. సత్యనారాయణ.. అయిల్ ఫెడ్ తెలంగాణ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముందుగా దివంగత ఉద్యోగి ఎ. శ్రీనివాసులు కు సమావేశం లో శ్రద్ధాంజలి ఘటించారు. తదుపరి సంఘం కార్యాలయం లో జరిగిన సర్వ సభ్య సమావేశం లో అధ్యక్షులు గా సిహెచ్ రాములు, ఉపాధ్యక్షులు గా కే. పవన్ కుమార్, ఎస్ శంకర్,ప్రధాన కార్యదర్శి గా వి. వెంకటేష్, కార్య నిర్వాహక కార్యదర్శులు గా ఎం. ఎన్ కార్తీక్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, సహాయ కార్యదర్శులు గా బి. గంగయ్య, బి. స్వర్ణ లత, యూ ఎస్. రాజేష్, కోశాధికారి గా ఎం. సంతోష్, సలహాదారులు గా ఎన్. శ్రీకాంత్ రెడ్డి, ఎ. బాలకృష్ణ లను ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి. సత్యనారాయణ తెలియజేసారు. ఆయిల్ ఫెడ్ సంస్థ లో ఉద్యోగుల సంక్షేమానికి సంఘం కొత్త కార్యవర్గం తమవంతు కృషి చేయాలనీ సమావేశం లో తీర్మానించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు జి. సత్యనారాయణ తెలిపారు..ఈ నూతన కార్యవర్గం కాలపరిమితి రెండు సంవత్సరాలు, సభ్యత్వ రుసుము రూ! 200 గా నిర్ణయించారు. ఈ సమావేశం లో ఉద్యోగుల పదోన్నతులు వెంటనే కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమం లో సీనియర్ ఉద్యోగులు సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి,కళ్యాణ్ గౌడ్, నాగబాబు, సునీత, స్వప్న, కవిత,స్వర్ణలత, నూతన ఉద్యోగుల కమిటీ అధ్యక్షులు సిహెచ్. రాములు,వెంకటేష్, సంతోష్ కుమార్, పాల్గొని నూతన కమిటీ సభ్యుల ను శాలువా తో సత్కరించి, అభినందనలు తెలియజేసారు..

# ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల పునఃప్రారంభంపై విద్యాశాఖ స్పష్టత

**నిజం న్యూస్ ఆంధ్రప్రదేశ్, జూన్ 8 :** సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్లుగా వేసవి సెలవులను పొడిగించే ప్రతిపాదన ఏదీ లేదని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన విద్యా క్యాలెండర్ ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలు 12 జూన్ 2026 (శుక్రవారం) నుండి యథావిధిగా పునఃప్రారంభం కానున్నాయి. ముఖ్య గమనిక: తెలంగాణ రాష్ట్రంలో జూన్ 13 (రెండో శనివారం), జూన్ 14 (ఆదివారం) రావడంతో అక్కడ పాఠశాలల ప్రారంభ తేదీని జూన్ 15, 2026కు మార్చారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. జూన్ 12, 2026 నుంచే అన్ని పాఠశాలలు ప్రారంభమవుతాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అధికారులు సూచించారు.

# బంగారం కొనాలనుకుంటున్నారా? తెలుగు రాష్ట్రాల్లో ధరలు ఎలా ఉన్నాయంటే?

**సోమవారం బంగారం, వెండి ధరలు వివరాలు మీకోసం**



దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు స్వల్ప మార్పులతో స్థిరంగా కొనసాగుతుండగా, వెండి ధరలు మాత్రం తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, పారిశ్రామిక డిమాండ్, పెట్టుబడిదారుల కొనుగోలు నిర్ణయాలు విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,610గా నమోదైంది. విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,980 వద్ద కొనసాగుతోంది. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే బంగారం ధరలో పెద్దగా మార్పు కనిపించకపోవడంతో మార్కెట్ స్థిరత్వం కొనసాగుతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ వెండి ధరలు మాత్రం క్షీణించాయి. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర హైదరాబాద్?లో రూ.1,39,990గా ఉంది. చెన్నైలో రూ.1,41,990 కాగా, ముంబయిలో రూ.1,39,990ల వద్ద, దిల్లీలో రూ.1,40,140ల వద్ద కొనసాగుతోంది.

**వెండి ధరలు ఇలా!**

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,51,300గా నమోదైంది. పరిశ్రమల అవసరాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్, పెట్టుబడిదారుల వ్యూహాల్లో మార్పులు వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**బంగారం కొనుగోలు సమయంలో స్వచ్ఛతకు ప్రాధాన్యం**

ధరలతో పాటు బంగారం నాణ్యతను కూడా పరిశీలించడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. బంగారం స్వచ్ఛతను క్యారెట్ల ఆధారంగా నిర్ణయిస్తారు. 24 క్యారెట్ల బంగారం దాదాపు 99.9 శాతం స్వచ్ఛత కలిగి ఉండి అత్యంత శుద్ధమైనదిగా పరిగణించబడుతుంది. అయితే ఇది చాలా మెత్తగా ఉండటంతో ఆభరణాల తయారీలో సాధారణంగా వినియోగించరు. బంగారు నాణేలు, బార్లు, బిస్కెట్లు వంటి పెట్టుబడి ఉత్పత్తుల తయారీలో దీనికి అధిక ప్రాధాన్యం ఉంటుంది.

మరోవైపు 22 క్యారెట్ల బంగారంలో స్వల్ప పరిమాణంలో వెండి, రాగి వంటి ఇతర లోహాలను కలపడం వల్ల అది మరింత బలంగా మారుతుంది. అందువల్ల నగల తయారీలో ప్రధానంగా 22 క్యారెట్ల బంగారాన్నే ఉపయోగిస్తారు. భారత మార్కెట్‌లో విక్రయించే ఎక్కువ శాతం బంగారు ఆభరణాలు ఈ ప్రమాణంలోనే అందుబాటులో ఉంటాయి.

**916 హాల్‌మార్క్ తప్పనిసరిగా పరిశీలించాలి**

బంగారం కొనుగోలు చేసే సమయంలో హాల్‌మార్క్ గుర్తును తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 916 హాల్‌మార్క్ ఉన్న బంగారం 22 క్యారెట్ల నాణ్యతకు సూచికగా పరిగణించబడుతుంది. హాల్‌మార్కింగ్ ద్వారా బంగారం స్వచ్ఛతకు అధికారిక ధ్రువీకరణ లభిస్తుంది. దీంతో వినియోగదారులు నాణ్యమైన బంగారాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

**ప్రకటించిన ధరే తుది ధర కాదు**

బంగారం ధరలు చూసి వెంటనే కొనుగోలు నిర్ణయం తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో ప్రకటించే ధరలు సాధారణంగా గ్రాము లేదా 10 గ్రాముల ప్రాథమిక ధరలు మాత్రమే. వీటికి అదనంగా జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు, హాల్‌మార్కింగ్ ఫీజులు, ఇతర పన్నులు కూడా జత అవుతాయి. దీంతో తుది బిల్లులో చెల్లించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రతి దుకాణంలో మేకింగ్ ఛార్జీలు, తరుగు రేట్లు భిన్నంగా ఉండొచ్చు. అందువల్ల కేవలం గ్రాము ధరను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం కంటే, బిల్లులోని అన్ని ఖర్చులను పరిశీలించి కొనుగోలు నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. నాణ్యత ధ్రువీకరణ ఉన్న ఆభరణాలను ఎంచుకోవడం ద్వారా వినియోగదారులు భవిష్యత్తులో నష్టాలను నివారించవచ్చని చెబుతున్నారు.

# తెలంగాణ అభివృద్ధికి మరో మైలురాయి

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 8:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది ఒక కీలక ఘట్టం. ఈ మహత్తర కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బీ కాలనీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబా చౌదరి ఆధ్వర్యంలో భారీ జనసమీకరణతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా బయలుదేరుతున్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి కి సంఘీభావం తెలుపుతూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడం విశేషం.జై కాంగ్రెస్ -- జై తెలంగాణ! అభివృద్ధే మా లక్ష్యం -- ప్రజాసేవే మా ధ్యేయం!

# ఈ-క్యాబినెట్ ప్రాజెక్టుపై సీఎస్ సమీక్ష



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8 :**ఈ-క్యాబినెట్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి +ూణ, ఐటీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలో జరగబోయే క్యాబినెట్ సమావేశం నాటికి వ్యవస్థను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలకు భారీ డిమాండ్

**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8 :**రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలకు ఈసారి భారీ డిమాండ్ నెలకొంది. పాలిసెట్ తొలి విడత సీట్ల కేటాయింపులోనే ఇప్పటికే 92 శాతం సీట్లు భర్తీ అయినట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్ వంటి కోర్సులకు విద్యార్థుల నుంచి అధిక స్పందన లభిస్తోంది. తక్కువ ఫీజులతో నాణ్యమైన సాంకేతిక విద్య అందుతుండటంతో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేయనున్నారు.

# జవాన్ ప్రాణం తీసిన అక్రమ సంబంధం



**నిజం న్యూస్ మెదక్, జూన్ 8 :**మెదక్ పట్టణంలో ఆర్మీ జవాన్ దారుణ హత్య వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని పొన్నం కుమార్ ని హత్య చేసిన భార్య, అత్తమామ, బావమరిది. ఇంట్లో ప్రియురాలి తో ఏకాంతంగా ఉండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న భార్య ఆగ్రహంతో పొన్నం కుమార్ ని తీవ్రంగా కొట్టి హత్య చేసిన కుటుంబ సభ్యులు ఆతర్వాత మెదక్ టౌన్ పీఎస్‌లో లొంగిపోయిన కుటుంబ సభ్యులు ప్రస్తుతం సెలవుల్లో ఉన్న మృతుడు కుమార్ ఎక్కువ సమయం ప్రియురాలు తో గడుపుతున్నాడని హత్య చేసిన కుటుంబ సభ్యులు

# భారతదేశంలో జననాల రేటు వేగవంతంగా తగ్గిపోతుంది

**టెక్ దిగ్గజం స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్**

**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8** :టెక్ దిగ్గజం, స్పేస్‌ఎక్స్ అధినేత అయిన ఎలాన్ మస్క్ భారతదేశంలో జననాల రేటు (Birth Rate) వేగంగా తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ప్రస్తావించిన గణాంకాల ప్రకారం, భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (Total Fertility Rate - TFR) గత దశాబ్దంలో 2.3 నుంచి 1.9కి పడిపోయింది. ఒక దేశ జనాభా స్థిరంగా కొనసాగాలంటే TFR కనీసం 2.1 ఉండాలి. ప్రస్తుతం భారత్ ఆ స్థాయి కంటే దిగువకు చేరింది.ముఖ్యంగా, విద్యావంతుల వర్గాల్లో ఈ తగ్గుదల చాలా కాలం క్రితమే ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఢిల్లీ TFR కేవలం 1.2 మాత్రమే ఉండటం గమనార్హం.




ఇది జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్న ఫిన్లాండ్ కంటే కూడా తక్కువ.

**దీని అర్థం ఏమిటి?**

ఇప్పటికిప్పుడు భారత జనాభా తగ్గకపోయినా, దీర్ఘకాలంలో: జనాభా పెరుగుదల మందగించవచ్చు.వృద్ధుల సంఖ్య పెరిగి, యువ జనాభా తగ్గవచ్చు. కార్మిక శక్తి (Workforce) తగ్గే ప్రమాదం ఉంటుంది.ఆర్థిక వృద్ధిపై ప్రభావం పడవచ్చు.గుచ్చే నిజం:గ "ఒక దేశ భవిష్యత్తును కేవలం ఈరోజు జనాభా నిర్ణయించదు; రేపు పుట్టబోయే పిల్లల సంఖ్య కూడా నిర్ణయిస్తుంది."

# రూ 99 కోట్లతో ఉప్పల్ భగాయత్ లో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతోపాటు పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 8 :** ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు ప్రజా ప్రతినిధులు అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు భారీగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బయలుదేరిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 8** :కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ సోమవారం మియాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు తన నివాసం నుండి భారీగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వెళ్లడం జరిగింది...ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బాచుపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను నేటితో పరిష్కారం కానున్నదన్నారు,సుమారు 150 కోట్ల రూపాయలతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైఓవర్ రేపటినుండి ప్రజలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని, అదేవిధంగా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని శంకుస్థాపన చేయను న నేపథ్యంలో స్థానిక సైబరాబాద్ తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
మంగళవారం 08-06-2026

# పెద్ది స్టెప్‌తో మరోసారి వైరల్.. కెవిన్ క్రేజ్ మామూలుగా లేదుగా!



ఒకప్పుడు సినీ తారల వెంట కనిపించే బాడీగార్డులు కేవలం భద్రతా సిబ్బందిగానే గుర్తింపు పొందేవారు. కానీ సోషల్ మీడియా యుగంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు స్టార్ హీరోలతో పాటు వారి బాడీగార్డులు కూడా ప్రత్యేక గుర్తింపు, అభిమాన వర్గాన్ని సంపాదించుకుంటున్నారు. తాజాగా మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ పర్సనల్ బాడీగార్డ్ కెవిన్ కుంట పేరు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి రావడం ఈ మార్పుకు నిదర్శనంగా నిలిచింది. రామ్ చరణ్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ సినిమా పెద్దిలో ప్రేక్షకులను ఆకట్టుకున్న బ్యాట్ సిగ్నేచర్ మూమెంట్‌ను కెవిన్ రీక్రియేట్ చేసిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు, మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. చరణ్ బాడీగార్డ్ మాత్రమే కాదు, సోషల్ మీడియా స్టార్ అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. వాస్తవానికి కెవిన్ వైరల్ అవడం ఇదేమీ మొదటిసారి కాదు. రామ్ చరణ్‌తో పలు ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్ దర్శనాలు, అభిమానుల మధ్య జరిగిన సందర్భాల్లో ఆయన ప్రొఫెషనల్ ప్రవర్తన, ఫిట్‌నెస్, స్టార్‌తో ఉన్న అనుబంధం కారణంగా ఇప్పటికే మంచి గుర్తింపు దక్కింది. సోషల్ మీడియాలో కెవిన్‌కు స్పెషల్ ఫ్యాన్ పేజీలు కూడా ఉండటం విశేషం. ఇప్పుడు పెద్దిలోని సిగ్నేచర్ స్టెప్‌ను తనదైన శైలిలో చేసి మరోసారి వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా ఏఆర్ రెహమాన్ అందించిన చికిరి చికిరి సాంగ్ ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలవగా, ఆ పాటకు సంబంధించిన డ్యాన్స్ మూమెంట్లు, రీల్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉండగా, కెవిన్ తాజా వీడియో కూడా ఆ జోరును మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెలబ్రిటీ బాడీగార్డులు స్టార్‌డమ్ పొందడం కొత్త విషయం కాకపోయినా, గత కొన్నేళ్లుగా ఇది మరింత స్పష్టంగా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్ బాడీగార్డ్ షేరా ఇప్పటికే సెలబ్రిటీ హోదా సంపాదించుకున్నారు. ఆయనకు స్పెషల్ ఫ్యాన్స్, సోషల్ మీడియా ఫాలోయింగ్ మాత్రమే కాదు, స్పెషల్ బ్రాండ్ వాల్యూ కూడా ఏర్పడింది. అదే తరహాలో సౌత్ సినీ ఇండస్ట్రీలో పరిశ్రమలో కెవిన్ వంటి వ్యక్తులు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. హీరోలతో రెగ్యులర్ గా కనిపించడం, వారి జీవితాల్లో కీలక పాత్ర పోషించడం, సోషల్ మీడియాలో వారి ఫొటోలు, వీడియోలు వైరల్ కావడం వంటి అంశాలు ఈ గుర్తింపుకు కారణమవుతున్నాయి. ఒకప్పుడు కెమెరా ఫ్రేమ్‌లో కనిపించకుండా ఉండే వ్యక్తులు, ఇప్పుడు నెటిజన్ల చర్చల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుండటం ఆసక్తికర పరిణామంగా మారింది. సోషల్ మీడియా ప్రభావంతో సెలబ్రిటీల చుట్టూ ఉన్న ప్రతి వ్యక్తి కూడా ప్రజల దృష్టిలోకి వస్తున్న ఈ కాలంలో, కెవిన్ తాజా వైరల్ వీడియో మరో ఉదాహరణగా నిలిచింది. పెద్ది సినిమా సృష్టించిన కల్చరల్ ఎఫెక్ట్ ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఆ సినిమా ద్వారా పరోక్షంగా కెవిన్ వంటి వ్యక్తుల క్రేజ్ కూడా పెరుగుతోంది. స్టార్ హీరోలకే పరిమితమైన అభిమాన ప్రపంచం ఇప్పుడు వారి సన్నిహిత సిబ్బంది వరకు విస్తరించిందని చెప్పడానికి ఈ సంఘటన చక్కని ఉదాహరణగా నిలుస్తోంది.

# సమంత, సాయి పల్లవి కలిస్తే.. ఒక్క రిప్లై తోనే ఫుల్ హైప్!



స్టార్ హీరోయిన్లు సమంత, సాయి పల్లవి కలిసి ఒక సినిమాలో నటిస్తే ఎలా ఉంటుంది? ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇదే విషయం హాట్ టాపిక్ గా మారింది. దీనికి కారణం మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్స్ సందర్భంగా జరిగిన ఓ ఇంట్రెస్టింగ్ ఇన్సిడెంట్. సామ్ లీడ్ రోల్ లో నటించి నిర్మించిన మా ఇంటి బంగారం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మూవీ టీమ్ ప్రమోషన్స్ ను ఇప్పటికే స్టార్ట్ చేసింది. అయితే ప్రమోషన్స్ లో భాగంగా సమంత రీసెంట్ గా ఓ వీడియోను షేర్ చేశారు. అందులో సినిమా కథ గురించి మాట్లాడుతూ.. అసలు మా ఇంటి బంగారం స్టోరీ మొదట సాయి పల్లవిని దృష్టిలో పెట్టుకుని రాశారని చెప్పారు. దర్శకురాలు నందినీ రెడ్డి కూడా ముందుగా సాయి పల్లవితో ఆ ప్రాజెక్ట్ చేయాలని భావించారట. కానీ ఆ సమయంలో సాయి పల్లవి వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో రిజెక్ట్ చేశారని సమంత తెలిపారు. ఆ తర్వాత కథలో కొన్ని మార్పులు చేసి తనకు తగ్గట్టు రూపొందించారని చెప్పారు. "ఈ సినిమాను నేను సెలెక్ట్ చేసుకోలేదు.. సినిమానే నన్ను ఎంపిక చేసుకుంది' అంటూ సామ్ చేసిన కామెంట్స్ ఫ్యాన్స్ ను ఆకట్టుకున్నాయి. అదే వీడియోను చూసిన సాయి పల్లవి వెంటనే రెస్పాండ్ అయ్యారు. సమంత ఇన్ స్టా స్టోరీని షేర్ చేస్తూ.. 'ఈ సినిమా సమంత చేయాల్సినదే. ఆమెకే బాగా సరిపోతుంది. సమంతకు, నందినీ రెడ్డికి నా విషెస్" అంటూ రాసుకొచ్చారు. అయితే ఆమె పోస్ట్ చివర్లో 'అవును.. త్వరలో' అంటూ ఇచ్చిన చిన్న మెసేజ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ఒక్క మాటతో కొత్త చర్చ మొదలైంది. సమంత, సాయి పల్లవి కలిసి ఏదైనా కొత్త సినిమా చేయబోతున్నారా? లేక మరో ప్రాజెక్ట్ గురించి ఇద్దరూ ఇప్పటికే మాట్లాడుకున్నారా? అనే ప్రశ్నలు అభిమానుల్లో మొదలయ్యాయి. దీనిపై ఇద్దరూ ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోయినా సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. నిజానికి సమంత, సాయి పల్లవి ఇద్దరూ యాక్టింగ్ కు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటారు. కమర్షియల్ సినిమాలతో పాటు కథకు ఇంపార్టెన్స్ ఉన్న చిత్రాల్లో కూడా తమదైన ముద్ర వేశారు. అందుకే వీరిద్దరూ కలిసి నటిస్తే బ్లాక్ బస్టర్ హిట్ మూవీ పక్కా అంటున్నారు సినీ ప్రియులు. మరోవైపు సమంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ కూడా ఉమెన్ ఓరియెంటెడ్ స్టోరీలపై ఎక్కువ ఫోకస్ పెడుతోంది. దీంతో ఫ్యూచర్ లో సాయి పల్లవితో కలిసి ఏదైనా సినిమా చేసే అవకాశం ఉందా అనే చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం అయితే దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఏదీ లేదు. కానీ సాయి పల్లవి చేసిన చిన్న కామెంట్ మాత్రం పెద్ద చర్చకు కారణమైంది. ఫుల్ హైప్ కూడా క్రియేట్ చేసింది. ఒకవేళ ఫ్యూచర్లో సమంత, సాయి పల్లవి కలిసి స్క్రీన్ పై కనిపిస్తే.. అది స్పెషల్ కాంబినేషన్ అవుతుందనడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు.

# 6 కోట్లతో తెరకెక్కి 1000కోట్లు.. హారర్ సినిమాపై ఆర్జీవీ ప్రశంస.. నెటిజనుల కౌంటర్లు!



సంచలనాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ నిరంతరం చిత్ర పరిశ్రమలోని తాజా పరిణామాలపై స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆయన అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తున్న ఇండిపెండెంట్ హారర్ చిత్రం -అబ్సెషన్- పై ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు కర్రీ బార్కర్, నటి ఇండే నవరెట్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ లో-బడ్జెట్ చిత్రం సాధించిన అసాధారణ విజయాన్ని వర్మ విశ్లేషించారు. ఎలాంటి భారీ స్టార్ కాస్టింగ్, అంచనాలు లేకుండా కేవలం బలమైన కంటెంట్‌తో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తోందని.. నేటి తరం మేకర్స్‌కు ఇది ఒక పాఠమని ఆర్జీవీ కొనియాడారు. అయితే ఎప్పుడూ ఇతరుల సినిమాలపై సమీక్షలు ఇచ్చే ఆర్జీవీ ట్వీట్‌పై నెటిజన్లు తమదైన శైలిలో పంచ్‌లతో విరుచుకుపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రామ్ గోపాల్ వర్మను టార్గెట్ చేస్తూ రకరకాల కామెంట్లు పెడుతున్నారు. --ఇతరుల సినిమాలను మెచ్చుకోవడం పక్కన పెట్టి మీరు ఎప్పుడు మళ్లీ శివ, సత్య, రక్తచరిత్ర లాంటి మంచి సినిమాలు తీస్తారో చెప్పండి సార్! అంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ఒకప్పుడు హారర్ చిత్రాలకు (దెయ్యం, రాత్ వంటి చిత్రాలతో) ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన ఆర్జీవీ ప్రస్తుతం కేవలం వివాదాస్పద చిత్రాలకే పరిమితం కావడంపై ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ చిన్న చిత్రాల సక్సెస్ ఫార్ములాను విశ్లేషించే బదులు టాలీవుడ్‌లో మళ్లీ తన పాత మ్యాజిక్‌ను రీక్రియేట్ చేయాలని పలువురు నెటిజన్లు ఆయనకు ఉచిత సలహాలు పడేస్తున్నారు. గ్లోబల్ హారర్ సెన్సేషన్ -అబ్సెషన్- భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ల్యాండ్ అయింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం... ఈ హాలీవుడ్ ఇండిపెండెంట్ చిత్రం భారతదేశంలో మొదటి రోజు సుమారు రూ. 80 లక్షల నుండి రూ. 1 కోటి వరకు వసూళ్లను సాధించింది. ఒక చిన్న సినిమా... ఎలాంటి భారీ ప్రమోషన్లు లేని విదేశీ చిత్రానికి మన దేశంలో ఈ స్థాయి ఓపెనింగ్స్ రావడం విశేషమనే చెప్పాలి. ముఖ్యంగా హారర్ జానర్ చిత్రాలకు భారతదేశంలో ఉండే మల్టీప్లెక్స్ ఆడియన్స్ మద్దతు ఈ చిత్రానికి తొలిరోజే ప్లస్ పాయింట్‌గా మారింది. ఇక దేశంలోని మెట్రో నగరాలైన ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలోని మల్టీప్లెక్సుల్లో -అబ్సెషన్- చిత్రానికి క్రేజ్ చాలా అద్భుతంగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో -అంతర్జాతీయ వేదికలపై ఈ చిత్రానికి వచ్చిన పాజిటివ్ టాక్ -రేటింగ్స్ చూసి మల్టీప్లెక్స్ ప్రేక్షకులు థియేటర్ల వైపు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా యువత- హారర్ చిత్రాల ప్రేమికులు మల్టీప్లెక్సుల్లో సాయంత్రం, రాత్రి షోలకు భారీగా తరలివస్తుండటంతో వీకెండ్‌లో బుకింగ్స్ ఊపందుకున్నాయి. మల్టీప్లెక్స్ వర్గాల సమాచారం ప్రకారం.. మునుముందు ఈ చిత్రానికి మౌత్ టాక్ ద్వారా థియేటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

తాజాగా ప్రణీత సుభాష్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ విషయానికి వస్తే..ఇంటర్ కాంటినెంటల్ మాల్దీవ్స్ లో మామూనగాన్ రిసార్ట్ కి ఫ్యామిలీతో కలిసి వెళ్ళింది. గజిబిజి లైఫ్ స్టైల్ లో నిత్యం పని మీదే ఫోకస్ పెడుతూ తమకంటూ సమయాన్ని కేటాయించుకోలేక.. ఫ్యామిలీతో గడపలేక ఇబ్బంది పడే సెలబ్రిటీలు చాలామంది ఉంటారు. అందుకే తమ తమ

# వెకేషన్ లో సెల్ఫ్ లవ్ గ్లామర్ టచ్ తో ప్రణీత!





సినిమాల నుండి లేదా ఇతర పనుల నుండి కాస్త విరామం దొరికితే చాలు వెకేషన్ అంటూ విదేశాలకు వెళ్లిపోయి అక్కడ చిల్ అవుతూ ఉంటారు. అంతేకాదు తమ ఫ్యామిలీతో వాల్యూ టైం స్పెండ్ చేస్తూ స్వాంతన పొందుతూ ఉంటారు. ఈ క్రమంలోనే ఒక బ్యూటీ సెల్ఫ్ లవ్ పొందడమే కాకుండా తన ఫ్యామిలీతో వాల్యుబుల్ టైం స్పెండ్ చేస్తూ ఆ ఫోటోలను క్యాప్చర్ చేసి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఆమె ఎవరో కాదు ఏం పిల్లో ఏం పిల్లడో చిత్రంలో తనీష్ సరసన హీరోయిన్గా నటించి తన అందాలతో.. అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రణీత సుభాష్. పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. అడపాదడపా సినిమాలు చేసి ఈ మధ్య ఇండస్ట్రీకి దూరమైంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల రెడ్ కార్పెట్ పై తన గ్లామర్ టచ్ తో హొయలు పోయి.. ప్రపంచ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకున్న ఈ చిన్నది తాజాగా వెకేషన్ లో భాగంగా సెల్ఫ్ లవ్ పొందుతూనే తన ఫ్యామిలీతో కలిసి సమయాన్ని కేటాయించడానికి విదేశాలకు వెళ్ళింది. ఈ నేపథ్యంలోనే అక్కడ తన ఫ్యామిలీతో గడిపిన ఆనందపు క్షణాలను అభిమానులతో పంచుకుంది. తాజాగా ప్రణీత సుభాష్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ విషయానికి వస్తే..ఇంటర్ కాంటినెంటల్ మాల్దీవ్స్ లో మామూనగాన్ రిసార్ట్ కి ఫ్యామిలీతో కలిసి వెళ్ళింది. అక్కడ బీచ్ సైడ్ అందాలు చూస్తూ అక్కడే కట్టిన నెట్ ఊయలపై పడుకొని అలల అందాలను ఆస్వాదిస్తూ మరొకవైపు తన దుస్తులతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో ఈమె తేలికైన వైట్ కో ఆర్డ్ సెట్ ను ధరించి చాలా సింపుల్ గా కనిపించింది. వైట్ స్కూప్ నెక్ ట్యాంక్ టాప్, దీనికి కాంబినేషన్లో డ్రాస్టింగ్ నడుము పట్టి కలిగిన వైట్ కలర్ ఫాంట్ ధరించి సింపుల్గా కనిపించింది. మొత్తానికి అయితే ప్రణీత సుభాష్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. 2010లో పూరీ జగన్నాథ్ తెలుగులో తీసిన పోకిరి సినిమా కన్నడ రీమేక్ పోర్కి సినిమాతో కన్నడలో అరంగేట్రం చేసిన ఈమె.. తెలుగులో ఏం పిల్లో ఏం పిల్లడో సినిమాతో అడుగు పెట్టింది. తర్వాత సిద్ధార్థ సరసన తెలుగులో నటించిన బావ సినిమా ఈమెకు మంచి పేరు తీసుకొచ్చింది. ఇక తర్వాత తమిళ్లో కూడా సినిమాలు చేసిన ఈమె.. అత్తారింటికి దారేదితో మంచి నటిగా పేరు దక్కించుకుంది. పాండవులు పాండవులు తుమ్మెద సినిమా కూడా ఈమెకు మంచి పేరు అందించింది.